క్లుప్తంగా

ప్రమాదవశాత్తు యాసిడ్ తాగి వృద్ధురాలి మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన కూర్మదాసు రమ్మణమ్మ(60) ప్రమాదవశాత్తు టాయిలెట్ క్లీనర్ అయిన యాసిడ్ తాగి మృతి చెందింది. ఎస్‌ఐ టి.శ్రీహరి చెప్పిన వివరాలు.. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మంచినీరు అనుకుని రమణమ్మ యాసిడ్ తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో బొబ్బిలి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి రమణమ్మ మృతి చెందినట్టు కుమారుడు అప్పలసూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కలువరాయిలో 'ఉపాధి' పనులు



మామిడి చెట్టు చుట్టూ బాగుచేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి గ్రామ మామిడితోటల్లో సస్యరక్షణ చర్యల్లో భాగంగా చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో తోటలపెంపకం జరుగుతోంది.. పెంపకానికి ఎంత నిధులు వెచ్చించారన్న విషయాలను ఏపీవో లక్ష్మీపతిరాజును అడిగి తెలుసుకున్నారు. ఉద్యానవనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ఉపాధి పథకం ద్వారా అందిస్తున్న మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వడ్డీ లేని రుణాలు అందించండి



మాట్లాడుతున్న వెలుగు ఏసీ చిరంజీవి

రేగిడి: స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లతో ఏసీ ఎ.చిరంజీవి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు, పీఎంఈజీపీ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని స్వయం శక్తి సంఘాలను బలోపేతం చేయాలని, సభ్యుల్లోని ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేని రుణాలు అందివ్వాలన్నారు. మండలంలో 1815 సంఘాల్లో 19,469 మంది సభ్యుల వివరాలను లోకోస్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. సమావేశంలో ఏపీఎం బి.గోవిందరావు, ఏపీఎం టి.దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్: అల్పపీడనం కారణంగా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లోని ప్రజలను నదీతీర ప్రాంతాలకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వరదలు, తుపాను, వర్షాల ప్రభావం పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేయండి



ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

రాజాం: వారంలో రెండు సార్లు ఫీవర్ సర్వే చేయాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ బి.నరేంద్ర, ఎం.సిద్ధీశ్వరిలు సూచించారు. అదే పీహెచ్‌సీలో పలు గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలతో బుధవారం సమావేశమైన వారు.. వర్షాకాలం కావడంతో జ్వరాలు అధికంగా ప్రబలే ప్రమాదం ఉందని, ఫీవర్ సర్వే చేసి, జ్వరాల బారిన పడినవారి వివరాలు సేకరించాలన్నారు. వైద్యసేవలు అందేలా చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ, వారి ఆరోగ్యంపై ప్రోగ్రెస్ రిపోర్టు పీహెచ్‌సీకి అందించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆరోగ్యానికి సోపానం



రామభద్రపురం: కొట్టక్కిలో ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సదస్సులు, ర్యాలీలు, సమతుల ఆహార ప్రదర్శనలు చేపట్టి, అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొని, పౌష్టికాహారం ఆరోగ్యానికి సోపానమని, ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేందుకు, పిల్లలకు మంచి ఆరోగ్యం, వయసుకు తగ్గ ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

-బొబ్బిలి, రాజాం



రేగిడి: లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ బంగారమ్మ



తెర్లాం: పెరుమాళి అంగన్‌వాడీ కేంద్రం-1లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి



తెర్లాం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టిన దృశ్యం



రేగిడి: చిన్నశిర్లాం ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శశికళ



బాడంగి: రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

మెరుగైన విద్యనందించాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి ఫ్లోరెన్స్

- గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి టి.ఎం.ఫ్లోరెన్స్

రేగిడి: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులాల సమన్వయ అధికారిణి టి.ఎం.ఫ్లోరెన్స్ సూచించారు. మండల కేంద్రంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆమె పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించి, అమలుచేయాలన్నారు.

విద్యార్థులు కూడా క్రమశిక్షణతో ఉండి విద్య నేర్చుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతిరోజూ స్నానం చేసి, ఉతికిన బట్టలు ధరించాలని, భోజనం ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నెమలాంలో పశువైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలో ఉన్న పశువైద్య కేంద్రాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం సందర్శించారు. పశువైద్య కేంద్రం పూర్తిగా మరమ్మతులకు గురైందని, చిన్నపాటి వర్షమొస్తే చాలు కారిపోతోందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పశువైద్య కేంద్రానికి కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పీఆర్ ఏఈతో మాట్లాడి నెమలాంలో కొత్తగా పశువైద్య కేంద్రానికి భవనం నిర్మించేందుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలోని ఉద్దవోలు ఎంపీటీసీ మరడాన చిన్నమ్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆ గ్రామం వెళ్లి, ఆమెను పరామర్శించారు. ఆమిటి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కరణం రమేష్‌నాయుడు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఆమెను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షులు ఎస్.వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించండి



రాజాం: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



రాజాం సిటీ: బుక్కా వీధిలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న వికాసత రంగిణి సభ్యులు

రాజాం: మట్టి విగ్రహాల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, వినాయక చవితి పండగలో అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమల పంపిణీ బుధవారం చేపట్టారు. పర్యావరణ హితం కోరుతూ మండలంలోని పలు గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వీటిని సమకూర్చారని, వారికి ధన్యవాదాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందికి 200 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశామన్నారు.

రాజాం సిటీ: పట్టణంలోని బుక్కా, కస్పా, సాయిబుల వీధుల్లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ బుధవారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో టంకాల వెంకటేశం, గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, కోరాడ శ్రీనివాసరావు, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం..



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

రాజాం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి కోరారు. స్థానిక పట్టణంలోని జీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల వద్ద రాజాం వాసవీ క్లబ్ వనితా శక్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ శాఖ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాజాం వనితా శక్తి అనతికాలంలోనే చాలా సామాజిక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. రక్తదాన శిబిరానికి రాజాం రెడ్‌క్రాస్, జీఎస్‌ఆర్ కళాశాల యాజమాన్యం సహకరించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానంపై నెలకొన్న అపోహలు వీడి రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వనితా శక్తి ప్రెసిడెంట్ పొట్నా శ్రీదేవి, పొట్నా ఈశ్వరరావు, రాపాక కన్యాకుమారి, వద్దాది లక్ష్మి, కొల్లూరు అరుణ, రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, జీఎస్‌ఆర్ కళాశాల చైర్మన్ పొగిరి రోజారమణి, డైరెక్టర్ ధర్మపురి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ గోవింద తదితరులు పాల్గొన్నారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయవలస, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు బుధవారం వేశారు. మూగజీవాలకు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యుడు దుర్గాప్రసాద్ కోరారు. అన్ని గ్రామాల్లో టీకాలు వేయడం జరుగుతోందన్నారు.

పారిశుధ్య పనులు



తెర్లాంలో కాలువల్లోని పూడికలను తీయిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్

తెర్లాం: మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు వ్యాధుల బారినపడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాలువల్లో పూడికతీతలు, బ్లీచింగ్ జల్లడం, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించడం వంటి పనులు చేయాలని తెలిపారు. గ్రామాల్లో జనసంచారం ఉన్న ప్రాంతాల్లో చెత్తాచెదారాలు వేయకుండా చూడాలన్నారు. మండల కేంద్రమైన తెర్లాంలోను, ఆమిటిలో పారిశుధ్య పనులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు.

పుస్తెలతాడు అపహరించిన దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ: డిగ్రీ వరకు చదువుకున్న యువకుడు వ్యసనానికి బానిసయ్యాడు. ఇంతలో తనకు వరుసకు బావ అయిన ఆర్మీలో పనిచేస్తున్న వ్యక్తితో కలిసి మద్యం సేవించి మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణకు పాల్పడ్డారు. ఈ ఘటన వివరాలను రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర బుధవారం తన కార్యాలయంలో వెల్లడించారు. ఈ నెల 2న ఉణుకూరు గ్రామానికి చెందిన మజ్జి భారతి అరసాడ వైపు పొలం పనులకోసం నడుచుకుంటూ వెళ్తోంది. అదే దారిలో కొత్తచెలికానివలసకు చెందిన కోట సంతోష్, ఆర్మీలో పనిచేస్తూ సెలవుపై వచ్చిన తునివాడకు చెందిన కళ్లేపల్లి భాస్కరరావు మద్యం సేవించి బైక్‌పై వస్తున్నారు. భారతి మెడలో బంగారు పుస్తెల తాడును చూసి తెంపేద్దామని సంతోష్ అనడంతో భాస్కరరావు వద్దని వారించాడు. ఫర్వాలేదు తప్పించుకోవచ్చని సంతోష్ నచ్చజెప్పడంతో తులంన్నర పుస్తెల పుస్తెలతాడు తెంపేసి సమీపంలోని తోటలో ద్విచక్రవాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యారు. సమీపంలోని పెట్రోల్‌బంకులోని సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులను పట్టుకుని పోలీసులు అరెస్టుచేశారు. కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎం.రాజారావు, పీసీ పి.శివ, చిరంజీవి. తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు రూ.40 వేల విరాళం

బొబ్బిలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాల రూపంలో సేకరించిన రూ.40 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించనున్నామని వీరబొబ్బిలి మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. తమ సంఘం ద్వారా రూ.20 వేలు, ఎమ్మెల్యే బేబీనాయన అందించిన మరో రూ.20 వేలు కలిపి మొత్తం రూ.40 వేలను అందజేయనున్నామన్నారు.

నేడు గ్రామ సందర్శన

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు హాజరవుతారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామంలో మండల నోడల్ ఆఫీసర్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం జరుగుతుందని, మండల స్థాయి అధికారులంతా రావాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కొత్తపెంట గ్రామంలో గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, నోడల్ ఆఫీసర్ మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా రావాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు.

రెన్యువల్ చేయాల్సిందే..

బొబ్బిలి: మండల కేంద్రంలోని సీబీఎం బాలికోన్నత పాఠశాల రెన్యువల్ చేయాల్సిందేనని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పట్టుబట్టారు. స్కూల్ రెన్యువల్ చేయకుండా తప్పించుకుని తిరుగుతున్న కరస్పాండెంట్ రత్నకుమార్ బుధవారం పాఠశాలకు రాగా ఆయనను అడ్డుకుని, నిలదీశారు. మే నెలలో రెన్యువల్ చేయాల్సి ఉండగా, ఇన్నాళ్లుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇది ట్రస్ట్ స్థలమని, దీనిని రికార్డుల్లో సొంతస్థలంగా మార్చుకుని విక్రయానికి పెట్టడమేంటని అడిగారు. ఇక్కడి పాఠశాలను కోమటిపల్లికి తరలించడం వెనక దాగి ఉన్న మర్మమేమిటన్నారు. పాఠశాల రెన్యువల్ కచ్చితంగా చేయాల్సిందేనని, రెన్యువల్ పత్రాలపై సంతకం పెడితేనే ఇక్కడి నుంచి కదులుతామని, అక్కడే బైఠాయించారు. దీంతో చేసేదేమీ లేక ఆయన ఆ పత్రాలపై సంతకం చేశారు. ఇదిలా ఉండగా ఇది మా ముత్తాతలు మాకోసం కొనుగోలు చేసిన స్థలమని, అప్పటి నుంచి ఇది మా ఆధీనంలోనే ఉందని రత్నకుమార్ తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన

బొబ్బిలి: మండల కేంద్రంలోని నారాయణ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై బుధవారం అవగాహన కల్పించారు. సీఐ కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఎక్కడపడితే అక్కడ మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు గుర్తించినా, అనుమానాస్పదంగా కనిపించినా రక్షణ కలిగే ప్రాంతాలకు వెళ్లిపోవాలన్నారు. మరింత రక్షణ కోసం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.


క్రీడాదుస్తుల వితరణ



క్రీడాదుస్తులతో విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పి.సునీల, ఐ.ఎస్.ప్రకాశరావులు అదే పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు బుధవారం వితరణ చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు తమవంతు సాయం చేయడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సన్నిబాబు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్: మండలంలోని కలువరాయి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఎంపీడీవో పి.రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వండుతున్నారా లేదా, వంటకాలు రుచి, శుచిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. పదార్థాలు కొంచెం వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు పెట్టాలని, వర్షాకాలం నేపథ్యంలో కాచివడపోసిన నీటిని తాగేందుకు అందుబాటులో ఉంచాలని వంట నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయ సిబ్బందిని కోరారు.